క్లుప్తంగా

తహసీల్దార్ కార్యాలయం వద్ద పాము హల్‌చల్



తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో పాము

మునగపాక: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం పాము హల్‌చల్ చేసింది. రెవెన్యూ కార్యాలయం దరి చెట్టుపై నుంచి ఒక్కసారిగా పాము కిందపడింది. కప్పను తినే క్రమంలో ఒక్కసారిగా చెట్టుపై నుంచి పడింది. దీంతో రెవెన్యూ కార్యాలయం సిబ్బంది ఆందోళనకు గురై పామును హతమార్చేందుకు యత్నించారు. ఈ క్రమంలో పాము సమీప మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోకి వెళ్లిపోయింది. దీంతో సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

చిన్నారుల పోషకాహారంలో జాగ్రత్తలు



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ

మునగపాక: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు అందించే పోషకాహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ కోరారు. మండలంలోని తిమ్మరాజుపేట జెడ్పీ హైస్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శుక్రవారం రెండో రోజు కొనసాగింది. ఆమె మాట్లాడుతూ ఆరు సంవత్సరాల పిల్లలకు సరైన పోషకాహారం అందించాలని, రక్తహీనత లేకుండా చూడాలన్నారు. పిల్లలకు చదువుపై ఆసక్తి పెరిగేలా చూడాలన్నారు. బాలింతలు, గర్భిణులకు మెరుగైన సేవలందించాలన్నారు.

ఇళ్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు



మాట్లాడుతున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు

మునగపాక: ప్రభుత్వ కొండపోరంబోకు స్థలంలో ఇళ్ల నిర్మాణాలు చేసిన వారంతా క్రమబద్ధీకరణకు దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు తెలిపారు. మండలంలోని మల్లవరంలో శుక్రవారం సాయంత్రం ఆయన అవగాహన కల్పించారు. 2014–19 మధ్య కాలంలో కొండ పోరంబోకు స్థలంలో నిర్మించుకున్న ఇళ్లు క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ఇందుకోసం గ్రామసభలు నిర్వహించి జీవో ఎంఎస్ 30 ప్రకారం దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. మరిన్ని వివరాలకు తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. సర్పంచ్ ఇందల హేమలతానాయుడు తదితరులు పాల్గొన్నారు.

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకండి



పాములవాకలో కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న రోగులు

కోటవురట్ల: కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో పరీక్షలు చేయించుకోవాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు కోరారు. పాములవాకలో రామాలయం వద్ద విశాఖకు చెందిన శంకర్ ఫౌండేషన్ సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పేదలకు కంటి వైద్యం అందని ద్రాక్షగా ఉందన్నారు. ప్రభుత్వ కంటి ఆస్పత్రులు లేకపోవడంతో పేదలు పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. వారికి ఇబ్బంది కలగకుండా తరచూ కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.6 లక్షలు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని దేవునిగుమ్మం వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం హుండీ కానుకలు లెక్కించారు. ఈ లెక్కింపులో ఆరు లక్షల ఇరవై రెండు వేల యాభై మూడు రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో టి. రాజసులోచన తెలిపారు. ఈ ఆదాయం 72 రోజులదన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, ప్రధాన అర్చకుడు పులకండం గిరిబాబు, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించకుండా పనులు

- డీఎల్‌పురం రైతుల ఆగ్రహం
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామంటున్న సర్పంచ్



డీఎల్‌పురంలో ఏపీఐఐసీ వారు చేపట్టిన రోడ్డు పనులు అడ్డుకుంటున్న రైతులు

నక్కపల్లి: మండలంలో ఏపీఐఐసీ వారు సేకరించిన భూములకు నష్టపరిహారం చెల్లించకుండా రోడ్డు పనులు ప్రారంభించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరిహారం కోసం కోర్టును ఆశ్రయించినప్పటికీ లెక్క చేయకుండా దౌర్జన్యానికి పాల్పడి జేసీబీల సాయంతో భూములను చదును చేస్తున్నారంటూ డీఎల్‌పురం సర్పంచ్ కిల్లాడ రామకృష్ణ ఆరోపించారు. వివరాల్లోకి వెళ్తే.. విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఏపీఐఐసీ వారు వేంపాడు, చందనాడ, డీఎల్‌పురంలో అమలాపురం తదితర గ్రామాల్లో భూములు సేకరించారు. డీఎల్‌పురంలో పాత సర్వే నంబరు 189 గాను కొత్త సర్వే నంబరు 193 నుంచి 199 వరకు సబ్ డివిజన్ చేసి కొద్ది సంవత్సరాల క్రితం గ్రామానికి చెందిన 14 మంది పేదలకు 64 ఎకరాలు డీఫారం పట్టాలు పంపిణీ చేశారు. ఈ భూములను ఏపీఐఐసీ వారు కంపెనీల కోసం తీసుకున్నారు. నష్టపరిహారం చెల్లించలేదు. జిరాయితీ భూములతోపాటు, కొంతమంది డీఫారం భూములకు నష్టపరిహారం చెల్లించి ఈ 14 మంది రైతులకు చెల్లించకుండా భూములు స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించారు. నష్టపరిహారం చెల్లించకపోవడంతో రైతులంతా కోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారం కొలిక్కి రాకుండానే ఏపీఐఐసీ అధికారులు వివాదంలో ఉన్న డీఫారం భూముల్లోకి బలవంతంగా యంత్రాలను పంపి చదును చేసి రోడ్లు వేస్తున్నారు. దీనిని అడ్డుకోవడానికి వెళ్లిన రైతులను పోలీసు కేసులు పెట్టి జైల్లో వేయిస్తామని బెదిరిస్తున్నారని సర్పంచ్ ఆరోపించారు. రోడ్డు పనులకు అడ్డువస్తే యంత్రాలతో తొక్కిస్తామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు పరిహారం చెల్లించకుండా అధికారాన్ని ఉపయోగించి పేదలకు చెందిన డీఫారం భూముల్లో బలవంతంగా రోడ్లు వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఆయన చెప్పారు. తక్షణమే అధికారులు స్పందించి డీఎల్‌పురం డీఫారం భూముల్లో ఏపీఐఐసీ వారు బలవంతంగా చేపట్టిన రోడ్డు, డ్రైనేజీ పనులను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆదమరిస్తే.. సెల్ గోవిందా..!

- బైక్‌పై వచ్చి మొబైల్స్ లాక్కొని పరారీ
- వరుస ఘటనలతో వాహనదారుల బెంబేలు



కోటవురట్ల: ఇటీవల మొబైల్ దొంగతనాలు పెరిగిపోయాయి. దొంగలు దర్జాగా బైక్‌పై వచ్చి మొబైల్స్ కాజేస్తున్నారు. బాధితులు తేరుకునేలోగా రయ్‌మని మాయమవుతున్నారు. ఇటువంటి కేసులు ఈ మధ్య కాలంలో పెరుగుతూ వస్తున్నాయి. ఏమాత్రం ఆదమరిచినా పై జేబులో ఉన్న సెల్‌ఫోన్ దొంగల చేతుల్లోకి సునాయాసంగా వెళ్లిపోతోంది. గతంలో కోటవురట్లకు చెందిన ఓ పాత్రికేయుని మొబైల్‌ను ఇలాగే దొంగిలించుకుపోయారు. నర్సీపట్నానికి చెందిన మరో పాత్రికేయుని మొబైల్‌ను యండపల్లి–గిడుతూరు రహదారిలో ఇద్దరు అగంతకులు బైక్‌పై వచ్చి చేతిలో నుంచి లాక్కుని పరారయ్యారు. తాజాగా శుక్రవారం యండపల్లికి చెందిన కె.అచ్చియ్యనాయుడు బైక్‌పై నర్సీపట్నం వెళుతుండగా ధర్మసాగరం జంక్షన్‌కు సమీపంలో వెనక నుంచి పల్సర్ బైక్ వచ్చిన ఇద్దరు అగంతకులు పై జేబులో ఉన్న మొబైల్ ఫోన్‌ను ఒక్క ఉదుటున లాక్కుని వేగంగా దూసుకుపోయారు. బాధితుడు తేరుకుని కేకలు వేసే సమయానికి దొంగలు మాయమయ్యారు. వ్యసనాలకు బానిసలైన యువకులు ఈ విధంగా మొబైల్ దొంగతనాలకు పాల్పడుతున్నట్టు తెలుస్తోంది. నిర్మానుష్యంగా ఉన్న రహదారుల్లో ఎక్కడో చోట మాటువేసి పై జేబులో మొబైల్ పెట్టుకుని వెళ్లేవాళ్లు, ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేసేవాళ్లను టార్గెట్ చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ మొబైల్ దొంగతనాలకు కొన్ని సింపుల్ ట్రిక్స్ వాడుతున్నారు. ఒక్కొక్కసారి ఇద్దరు వ్యక్తులు బైక్ ఒరిగిపోతున్నట్టు నటిస్తారు. అది చూసి సాయం చేద్దామని వెళ్లేవారి మొబైల్‌ను లాక్కుని పరారవుతున్నారు. కాబట్టి మొబైల్‌ను చొక్కా జేబులో పెట్టుకుని వెళ్లేవాళ్లు, ఫోన్ మాట్లాడుతూ వెళ్లేవాళ్లు తస్మాత్ జాగ్రత్త సుమీ.. పోలీసులు మొబైల్ దొంగల ఆటకట్టించాలని పలువురు కోరుతున్నారు.

బధిర విద్యార్థుల విద్యకు దరఖాస్తులు

పాయకరావుపేట: మండలంలో శారీరక, బధిర విద్యార్థులు విద్యాభ్యాసానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఎంపీడీవో ఎ.జయప్రకాష్ రావు తెలిపారు. సంబంధిత శాఖ ద్వారా నిర్వహించే పాఠశాలల్లో 4వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకునేందుకు మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పొంచి ఉన్న ప్రమాదం



రక్షణ గోడ లేక ప్రమాదకరంగా ఉన్న దృశ్యం

కోటవురట్ల: ప్రధాన రహదారుల్లో పలుచోట్ల కల్వర్టులపై రక్షణగోడలు లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. నిత్యం వందలాది మంది వాహనదారులు ఈ రహదారుల్లో ప్రయాణించాలంటే ఆందోళన చెందుతున్నారు. కోటవురట్ల శివారు రాట్నాలపాలెంలో నర్సీపట్నం–రేవుపోలవరం మెయిన్‌రోడ్డులో గెడ్డపై రక్షణ గోడ నిర్మించలేదు. ఎన్నో ఏళ్లుగా ప్రమాదస్థితి ఉన్నా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోలేదు. వాహనదారులు, పాదచారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా పదడుగుల లోతులో ఉన్న గెడ్డలో పడి తీవ్రంగా గాయపడడం ఖాయం. అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే రక్షణ గోడలు నిర్మించాలని కోరుతున్నారు.

రోడ్డు నిర్వాసితుల వివరాల సేకరణ



మునగపాక రెవెన్యూ పరిధిలో రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణకు సంబంధించి నిర్వాసితుల వివరాలు పక్కాగా ఉండేలా అధికారులు చర్యలు చేపట్టారు. అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు 14 కిలోమీటర్ల మేర వంద అడుగులకు రహదారిని విస్తరించనున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు శుక్రవారం రెవెన్యూ అధికారులు గ్రామాల వారీగా గతంలో నమోదు చేసిన బాధిత రైతుల వివరాలు మరోసారి పక్కాగా ఉండేలా ఫీల్డ్ విజిట్ చేశారు. ప్రతి రైతుకు పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు తెలిపారు. వీఆర్వో సురేష్, సర్వేయర్ భవాని, రెవెన్యూ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

వేసవిలో తగు జాగ్రత్తలు పాటించాలి



మూలపేటలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ విమలగిరి

మునగపాక: ప్రతి ఒక్కరూ సీజన్‌లో ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి విమలగిరి కోరారు. మండలంలోని మూలపేటలో శుక్రవారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఉదయం 11 గంటల తర్వాత బయటకు వెళ్లకుండా ఉంటే మంచిదన్నారు. వడదెబ్బకు గురికాకుండా చూసుకోవాలన్నారు. శిబిరాన్ని సర్పంచ్ బీశెట్టి గంగప్పలనాయుడు పరిశీలించారు. వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి గంగాధర్, వైద్య సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

లబ్ధిదారుల గుర్తింపు కోసం పీ– 4 సర్వే



కైలాసపట్నం గ్రామసభలో చెత్త కుండీలు అందిస్తున్న ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు



గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి: పీ– 4 సర్వేకు ప్రజలంతా సహకరించి సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సీతారామరాజు కోరారు. పీ– 4 సర్వేపై శుక్రవారం గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. ఈ సభల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వివిధ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల గుర్తింపు కోసం ఈ సర్వే ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సచివాలయ సిబ్బంది ఇళ్లకు వచ్చి సమాచారం సేకరిస్తారని, వారికి పూర్తి వివరాలు అందజేయాలన్నారు. మండలంలో మొదటి రోజు 16 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించడం జరుగుతోందన్నారు. రెండు విడతల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు తెలియజేస్తామన్నారు. గ్రామసభల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పీ–4 సర్వేతో అర్హులకు సంక్షేమం

కోటవురట్ల: పీ–4 సర్వేతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. మండలంలో అక్సాహేబుపేట, అన్నవరం, బోడపాలెం, చినబొడ్డేపల్లి, చౌడువాడ, గొట్టివాడ, జల్లూరు, కైలాసపట్నం, కొడవటిపూడి, కోటవురట్ల, నీలిగుంట, పాములవాక, పందూరు, రాజుపేట, రామచంద్రపాలెం, రామచంద్రపురం, సుంకపూరు, టి.జగ్గంపేట, తంగేడు, కె.వెంకటాపురం, యండపల్లి గ్రామాల్లో శుక్రవారం పీ–4 సర్వే గ్రామసభలు నిర్వహించారు. కైలాసపట్నం గ్రామసభలో ఎంపీడీవో పాల్గొన్నారు. సర్వేపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. గత వారం రోజులుగా సర్వేలో గుర్తించిన అంశాలను కార్యదర్శి విజయలక్ష్మి వివరించారు. అనంతరం ఇంటి పన్నులు కట్టిన వారికి తడి, పొడి చెత్తలను వేర్వేరుగా వేయడానికి ప్లాస్టిక్ డబ్బాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెన్నాడ నూకరత్నం, గోవాడ గెడ్డ చైర్మన్ డి.వి.రావు, వైస్ చైర్మన్ బి.మాణిక్యాలరావు, వీఆర్వో రామకృష్ణ, వెల్ఫేర్ అసిస్టెంట్ రూప, మహిళా పోలీసు లలితకుమారి, ఫీల్డ్ అసిస్టెంట్ జ్యోతి పాల్గొన్నారు.

రూ.9.24 లక్షలకు మాడుగుల వారపు సంత వేలం

మాడుగుల: మాడుగుల పట్టణ వారపు సంత వేలం పాట శుక్రవారం మాడుగుల పంచాయతీ కార్యాలయంలో జరిగింది. ఈ వేలం పాటలో 21 మంది రూ. 2.50 లక్షలు డిపాజిట్ చెల్లించి పాల్గొన్నారు. చివరికి గ్రామానికి చెందిన మామిడి కొండాజీ రూ.9.24 లక్షలకు పాటను దక్కించుకున్నారు. గతేడాది రూ.8.80 లక్షలకు పాట వెళ్లగా.. ఈ ఏడాది రూ.44 వేలు అదనంగా ఆదాయం వచ్చింది. పాటలో పాల్గొన్న వారికి తమ డిపాజిట్‌ను తిరిగి చెల్లించేసినటుట పంచాయతీ ఈవో మూర్తిబాబు తెలిపారు. సర్పంచ్ ఎడ్ల కళావతి, పంచాయతీ విస్తరణాధికారి సతీష్ పాల్గొన్నారు.

కోళ్లఫారాలకు అనుమతి లేకుంటే చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



పాటిపల్లిలో కోళ్ల ఫారం పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు

మునగపాక: మండలంలోని పలు చోట్ల అనుమతులు లేకుండా కోళ్ల ఫారాలు పుట్టగొడుగుల్లా దర్శనమిస్తున్నాయి. పంచాయతీ తీర్మానాలు లేకుండా ఇష్టానుసారంగా వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఈ విషయమై సాక్షి దినపత్రికలో ఈ నెల 20న పుట్టగొడుగుల్లా కోళ్లఫారాలు శీర్షికన కథనం వెలువడింది. దీనికి స్పందించిన తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు పాటిపల్లి, కాకరాపల్లి తదితర ప్రాంతాల్లోని కోళ్లఫారాలను పరిశీలించారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేయడం తగదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్య సమస్య తలెత్తకుండా చూసుకోవాలన్నారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమించి కోళ్లఫారాలు ఏర్పాటు చేస్తే, లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్



మాట్లాడుతున్న సీపీఎం కన్వీనర్ రాము

అచ్యుతాపురం రూరల్: గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కల్పించి నిరుపేదలు ఆర్థిక ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని సీపీఎం అచ్యుతాపురం కన్వీనర్ రొంగలి రాము డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా వెదురువాడ, గొర్లిధర్మవరం, మడుతూరు పంచాయతీల్లో శుక్రవారం ఆయన ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మడుతూరు దళిత కాలనీలో మంచినీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్థానికులకు పరిశ్రమల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రజలు తెలియజేసిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. సమస్యలు పరిష్కారం కాకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కూండ్రపు సోమునాయుడు, అప్పారావు, శ్రీను, భవాని, రమణ, రాణి, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మికులతో పనిచేయించొద్దు



షాపింగ్‌మాల్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

యలమంచిలి రూరల్: మైనర్లతో పనులు చేయించడం, వాళ్లను షాపింగ్‌మాల్స్, దుకాణాలు, ఇతర సంస్థల్లో పనిలో పెట్టుకోకూడదని యలమంచిలి సహాయ కార్మిక శాఖాధికారి వెంకటేశ్వర్రావు హెచ్చరించారు. యలమంచిలి పట్టణంలో పలు దుకాణాలు, వ్యాపార సంస్థల్లో శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. బాలలతో వెట్టి చాకిరీ చేయించే వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయిస్తామన్నారు. ఇక నుంచి తరచుగా తనిఖీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల హక్కుల పరిరక్షణ కమిటీ ప్రతినిధి డి. లోవరాజు, పట్టణ ఎస్సై కె. సావిత్రి, ఏఎస్సై చెల్లారావు, లీల పాల్గొన్నారు.

104 సేవలకు తగ్గుతున్న ఆదరణ



పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి రాజేశ్వరి

ఎస్.రాయవరం: 104 వాహన సేవలకు రోజురోజుకు ఆదరణ తగ్గుతోంది. శుక్రవారం గుర్రాజుపేటలో 104 సేవలందించారు. గతంలో 104 సిబ్బందితో పాటు వైద్యులు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉండేవారు. కూటమి పాలనలో 104 వాహనం వద్ద పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేశ్వరి కొంత సమయం సేవలందించి, తదుపరి పీహెచ్‌సీలో సేవలందించారు. ఒకే వైద్యాధికారి రెండు చోట్ల సేవలందించాల్సి వచ్చింది. ఇదే విషయం వైద్యాధికారి వద్ద ప్రస్తావించగా పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది కొరత ఉందన్నారు. దాంతో సేవలకు ఆటంకం కలగకుండా చూస్తున్నామన్నారు. 104 వాహనం వద్ద ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఉండి, ఆ తర్వాత 4 గంటల నుంచి పీహెచ్‌సీలో సేవలందించారు.

గ్రామాల్లో గరగల సందడి

- రాత్రిళ్లు గ్రామదేవతల ప్రతిరూపాలు ఊరేగింపు
- కొత్త అమావాస్య వేడుకలకు ముస్తాబవుతున్న ఆలయాలు



నూకాలమ్మ విగ్రహం



నక్కపల్లిలో నూకాలమ్మ ఆలయం



రాత్రిపూట దేవవరంలో అమ్మవారి ఘటాలతో నృత్యం చేస్తున్న దృశ్యం

నక్కపల్లి: పల్లెల్లో గ్రామదేవతల పండగ సందడి మొదలైంది. గ్రామీణ ప్రాంతాల్లో తమ ఆరాధ్యదేవతలైన నూకాలమ్మ, మరిడమ్మ, సత్తమ్మ, బంగారమ్మ, ఓరుగుంటాలమ్మ, తదితర పేర్లతో అమ్మవారి పండగలను నిర్వహించడం అనాదిగా వస్తోంది. ఏటా కొత్త అమావాస్యకు పది రోజులు ముందు నుంచి ఈ సందడి మొదలవుతోంది. గ్రామాల్లో రాత్రిళ్లు గరగలు, ఘటాలు పేరుతో అమ్మవారి ప్రతిరూపాలను కొంత మంది పూజారులు నెత్తిన పెట్టుకుని నృత్యం చేస్తూ గ్రామాల్లో ఊరేగిస్తారు. ఈ సందర్భంగా పలువురు అమ్మవారి ఘటాలకు పసుపు, కుంకుమలు సమర్పిస్తారు. మరికొంత మంది తమ ఇళ్ల వద్ద అమ్మవారి ఘటాలకు సంబంధించి మొక్కులు తీర్చుకునే కార్యక్రమం చేపడతారు. నక్కపల్లి, ఉద్దండపురం, వేంపాడు, గొడిచెర్ల, చినదొడ్డిగల్లు, దేవవరం, కాగిత, నెల్లిపూడి, పాయకరావుపేట, మంగవరం, సత్యవరం, పెంటకోట సీతారామపురం, నామవరం ఇలా పలు గ్రామాల్లో అమ్మవారి ఘటాలను తీసి రాత్రి సమయాల్లో ఊరేగిస్తున్నారు. పిల్లలు, పెద్దలు రాత్రంతా అమ్మవారి ఘటాలతో పాటు గ్రామమంతా తిరిగి సందడి చేస్తున్నారు. పది రోజుల పాటు పల్లెల్లో జాతర జరుగుతుంది. డప్పు వాయిద్యాలు, నేలవేషాలతో కొత్త అమావాస్య వరకు గ్రామాలు సందడిగా ఉంటాయి. కొత్త అమావాస్యకు పది రోజుల ముందు నుంచి ఈ విధంగా చేయడం వల్ల అమ్మవారు గ్రామంలో తిరుగుతూ ప్రజల బాగోగులను చూస్తూ కంటికి రెప్పలా కాపాడతారనేది ప్రజల నమ్మకం. పది రోజుల పాటు గ్రామాల్లో అమ్మవారి ఘటాలను ఊరేగించి కొత్త అమావాస్య ముందురోజు రాత్రంతా పెద్ద జాతర నిర్వహిస్తారు. తెల్లవార్లూ నేల డ్యాన్స్, తప్పెటగుళ్ల వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. నక్కపల్లి, వేంపాడు, దేవవరం తదితర గ్రామాల్లో నూకాలమ్మ జాతర చాలా ఘనంగా జరుగుతోంది. ఉద్యోగ, వ్యాపార రీత్యా ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారు జాతరకు హాజరై కుటుంబ సభ్యులతో సంబరాలు జరుపుకుంటారు. కొత్త అమావాస్య రోజు ఆయా గ్రామాల్లో ఉన్న అమ్మవార్లకు తమకు తోచిన విధంగా కానుకలు, మొక్కులు చెల్లించుకుంటారు. భక్తులతో అమ్మవారి ఆలయాలు కిటకిటలాడతాయి. కొత్త అమావాస్య నాడు నిర్వహించే అమ్మవారి పండగకు ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నాయి. అమ్మవారికి విగ్రహాలకు, ఆలయాలకు రంగులు వేసే కార్యక్రమం ప్రారంభించారు. భారీ విద్యుద్దీకరణ, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

27న ఉప సర్పంచ్‌ల ఎన్నిక

మాడుగుల రూరల్: వివిధ కారణాలతో ఖాళీ అయిన గ్రామ ఉప సర్పంచ్‌ల ఎన్నిక ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మాడుగుల, కె.జె.పురం, కింతలి, పోతనపూడి గ్రామాల ఉప సర్పంచ్‌లు ఎన్నిక ఆ రోజు ఉదయం 11 గంటలకు జరుగుతుందని పేర్కొన్నారు.

అక్రమ క్వారీలపై చర్యలకు డిమాండ్

అనకాపల్లి టౌన్: మండలంలోని అక్రమ క్వారీలపై చర్యలు తీసుకోవాలని, మైనింగ్, రెవెన్యూ, పోలీస్, రవాణా శాఖల అధికారులు మామూళ్లకు అలవాటు పడి బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ విమర్శించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారీ పేలుడు పదార్థాలతో బ్లాస్టింగ్‌లు చేసి అక్రమంగా క్వారీల్లో రాళ్లను పేల్చడంతో చుట్టు పక్కల గ్రామాల్లో ఇళ్లు బీటలు వారుతున్నాయన్నారు. పట్టణంలో భారీ వాహనాలు రావడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, దీని వల్ల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని వాపోయారు. ఎంపీ సీఎం రమేష్ అక్రమార్కులకు అండగా ఉంటూ అధికారులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

కాలువ, రోడ్డు నిర్మాణాలు ఆపాలని ఫిర్యాదు



సమాధులకు సమీపంలో తవ్విన కాలువ

ఎస్.రాయవరం: స్థానిక ముస్లిం సమాధులకు ఆనుకుని చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైనేజీ కాలువ నిర్మాణం వెంటనే నిలుపుదల చేయాలని ముస్లిం మతపెద్దలు శుక్రవారం తహసీల్దార్ జె.రమేష్ బాబు ఫిర్యాదు చేశారు. గ్రామానికి ఆనుకున్న సమాధి భూమి చుట్టూ నివాసాలు ఉన్నాయి. వాటికి అవసరమైన రోడ్డు, డ్రైనేజీ కాలువ నిర్మాణం చేసేందుకు కాలువ తవ్వారు. ఆ తవ్వకాలకు ఆనుకుని ఉన్న సమాధి భూమి తొలగించవద్దని, రక్షణ కల్పించాలని ఫిర్యాదులో కోరారు. ఈ మేరకు రెవెన్యూ సిబ్బంది వెళ్లి పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ సమాధి భూములకు ఎటువంటి ఇబ్బందులు లేవన్నారు. ఈ ప్రాంతంలో శాశ్వత నిర్మాణాలు ఉన్నందున అవసరమైన రోడ్డు, కాలువ నిర్మాణం చేపడుతున్నారన్నారు. సమాధులు ఉన్న ప్రాంతంలో ఎటువంటి నిర్మాణం చేపట్టడం లేదని చెప్పారు. అయినప్పటికీ ముస్లిం మతపెద్దలు ఇదే సమస్యపై కలెక్టర్‌కు, హోం మంత్రికి ఫిర్యాదు చేశారన్నారు.